# టి.సి. అమోఘం



యర్రంశెట్టి సాయి

అమోఘరావు తెల్ల రైల్వేకోటు తొడుక్కొంటూంటే, సరస్వతి అన్నం గరిటెతో సహా హాల్లోకి వచ్చేసింది.

'ఇదిగో! మీకు మళ్ళీ వార్నింగిస్తున్నా...పాపాయిని మళ్ళీ స్టేషన్లో టికెట్టడిగారంటే బావుండదంతే..'

'బావుందే నీ గొడవ! అది నా డ్యూటీ! మీ చెల్లాయిగదాని టిక్కెట్టడగద్దేమిటి?'

'ఆ! చేశారులెండి పెద్ద డ్యూటీ! దానికి సీజను టిక్కెట్టుందని తెల్సి అడగడమేమిటి?...మిగతావాళ్ళందర్నీ అడగరేం మరి?...'

'ఛప్! నేను వీళ్ళయినంతమంది సీజన్ టికెట్లు చెక్ చేస్తుంటాను తెల్సా? అందుగ్గాపతే షేముంది దేంకేం అక్కడ?'

'ఆ! ఈ ప్రపంచంలో మీరొక్కరే చేస్తున్నారు ఈ ఉద్యోగం! పోనీ బావగారు గదాని ఊరుకొంటోందది ..'

'లేకపోతే ఏం చేస్తుందేం?'

'ఏం చేస్తుందా ?...మొన్న పేపర్లో చూడలా ! బొంబేలో మీలాంటి టి. సి. ఒకాతను, రోజూ ఓ చక్కటి పిల్లదగ్గర టిక్కెట్ట్ చెక్ చేస్తూ, అయిదు నిముషాలు నుంచోబెట్టడం మొదలెట్టాట్ట! నాల్రోజులాగి, అయిదోరోజు టిక్కెట్టడగ్గానే, ప్రక్కకు పిలిచి చెంప ఛెళ్ళు మనిపించి వెళ్ళిపోయింది. తెల్సిందా?...అనక మీ యిష్టం! మఱదలు చెంప దెబ్బ కొట్టిందని తర్వాత గోలెడితే లాభం లేదు...'

అమోఘరావు గొల్లున నవ్వేశాడు.

'అవునే!...ఇలా ఆడపిల్లల బెదిరింపులకి దడిస్తే, మేమిక ఉద్యోగాలు చెయ్యాల్సిందే! నేనసలే స్ట్రిక్ట్ మనిషిని ... టికెట్ లేకుండా మీ నాన్నొచ్చినా, ఆఖరికి నువ్వొచ్చినా సరే...ఛార్జిచేసి పారేస్తానంతే! తలుపేసుకో...టైమయింది పోతున్నాను...'

'ఆ! ఈ పడిపోయే రైళ్ళకి టికెట్టొకటే తక్కువ...మా నాన్నేం మీలా టికెట్టుకి మొహం చూసుకొనే రకంకాదు. మీ రడక్కముందే మీ మొఖాన విసిరి కొడతారు.' చర చరా లోపలికి పోయింది సరస్వతి.

అమోఘరావ్వాళ్ళ నాన్న కలెక్టరుద్యోగం చేసి రిటైరయి పోయాడు, ఆయన చాలా 'రూల్స్' మనిషి. 'ఇంచం' అనే మాట

వినబడితే వారం రోజులు వాంతులయ్యే వాయనకి. ఆ మాటన్నవాడినీ, అనిపించిన వాడినీ, ఇద్దరిమీదా వాళ్ళ స్రెలోజులు మంచం పట్టేంత 'ఏక్షన్' తీసుకొనే వాడు. అంచేత ఆయన్పేరు చెబితే, చెప్పక పోయినా సరే, నిద్రపోతున్న ఆఫీసు ఫైళ్ళు, సదర్న్ ఎక్స్‌ప్రెసంత స్పీడులో పరిగెడుతుండేవి. ఏ ఫైల్ మీద ఎప్పుడు దండయాత్ర కొస్తాడోనని గుమాస్తాలందరూ వణుకుతూ, ధైర్యంకోసం ఆంజనేయస్వామి ఫోటోలు డస్కులలో పెట్టుకొంటూండే వాళ్ళు.

సర్ప్రయిజ్ చెకింగ్ ఇచ్చేసి, సీట్లో లేకుండా, నారాయణ హోటల్ ముందు నుంచొని బాతాఖానీ కొడుతూండే అప్పినాధాన్ని వారంరోజులు సస్పెండ్ చేశాడని ఓ రోజూ, సీట్లో ఉండే నిద్రపోతున్న ఏడుకొండల్ని బెంకిజెల్లా కొట్టి, నిద్ర లేపి వార్నింగిచ్చాడని మరో రోజూ, ఫైల్స్ వతల పారేసి వారపత్రిక చదువుకొంటూన్న విస్సిరాజుని పద్నేరోజులు కంపల్సరీ 'లీవ్' పెట్టించాడని ఇంకో రోజూ...ఇలా ఆయన్ని గురించి రోజూ ఏవో వార్తలొస్తూండేవి.

అంచేత తిరణాల్లా, ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా నుంచొని 'హస్కు' దంచేస్తుండే ఆఫీసులవాళ్ళందరూ, పదిన్నర కొట్టగానే ఎవరి సీట్లలోకి వాళ్ళు దూకేస్తుండేవాళ్ళు...

# టి. సి. అమోఘం

ఇదిలా ఉన్నట్లుండగా ఆయన కోరోజు ఓ ఆలోచన వచ్చింది. తన తరువాత తనంత 'స్ట్రిక్ట్' మనిషెవరూ అని! వెంటనే ఆయన కళ్ళకి బి ఏ. ఫైనలియర్ చదువుతోన్న సుపుత్రుడు అమోఘరావు కనబడ్డాడు.

మర్నాటినుంచీ ఆయన అమోఘరావుకి 'రూల్సు' మనిషిగా తర్ఫీదివ్వడం మొదలెట్టేడు. రెండేళ్ళు తిరక్కుండానే అమోఘరావు రూల్సుమనిషయికూచున్నాడు 'రూల్స్'లో వాళ్ళ నాన్నకంటె నాలుగాకులెక్కువే చదివేశాడు. 'స్ట్రిక్ట్' మనిషయి పోవడంచేత అతను బి ఏ. ఎగ్జామిన్స్‌లో కాపీ కొట్టలేదు. అంచేత నాలుగేళ్లయినా అది పాసవలేకపోయాడు. చాలా కష్టం మీద అయిదోసారి అది కాస్తా అయిందనిపించేసరికి, ఓకేసులో మరీ 'స్ట్రిక్ట్'గా పవ్వేసినందువల్ల వాళ్ళ నాన్నకి 'కంపల్సరీ రిటయిర్‌మెంట్' యిచ్చేశారు. ఆ బెంగతో ఆయన మంచమెక్కేసి, బాంకులో ఉన్న కష్టార్జితమంతా కాస్రోజుల్లో ఖర్చెట్టేశాడు. తరువాత ఆ సంగద్నెల్సి ఓ రోజు 'రణేర్'మని చచ్చిపోయాడు. పోయేముందు కొడుకేశ్వరావుని దగ్గరకు పిల్చి 'చిట్టీ! నూవూ మాంచి 'స్ట్రిక్' కలక్టరయి పోయి నా పేరు నిలబెట్టెసెయ్! పని తొందర్లో మర్చిపోయేవ్...ఏం ?' అనేసి అలా అన్నెస్పి ఓ చిన్న సైజు వాగ్దానం లాంటిది తీసేసుకొన్నాడు.

ఆతరువాత అమోఘరావు కలెక్టరుద్యోగంకోసం వెదికి పంచదారలా అది దొరికే హోప్ కూడా కనబడక ఓ ముహూర్తంలో టికెట్ కలెక్టర్ ఉద్యోగం సంపాదించేసి 'నాన్నా! మీరు చెప్పినట్లు కలెక్టరుద్యోగం దొరకలేదు గాని టికెట్ కలెక్టరుద్యోగం దొరికింది. 'డజన్ట్ మేటర్'! మీ పేరు ఈ ఉద్యోగంలోనే నిలబెట్టేస్తాను. . ఇక చూస్కోండి !...' అనేశాడు. అనేసి చాలా ఖచ్చితంగా రూళ్ళమీద నడవడం మొదలెట్టేడు.

నెంబరు త్రీ ప్లాట్‌ఫారంమీద యేదో పాసింజెరు బండి వచ్చి ఆగింది. గేటుదగ్గర నుంచొని టిక్కెట్లు తీసుకొంటున్నాడు అమోఘరావు. కాసేపటికి రష్ తగ్గిపోయింది ప్రక్కనున్న స్టూల్ మీద టిక్కెట్లు 'నిప్' చేస్తూ కూచున్నాడు

ఇంతలోనే ఓ అమ్మాయి వయ్యారంగా నడుస్తూ గేటు బయటకు వెళ్ళబోయింది.

'టికెట్ ప్లీజ్ !' అన్నాడు అమోఘరావు

రక్కున ఆగిపోయిందా అమ్మాయి. అమోఘరావంక చాలా పిర్లీగా చూసి కొద్దిగా నవ్వేసింది. 'ఫో మావా !... సరసాలూ...' అనేసి ముందుకి నడవబోయింది.


అమోఘరావు లేచి నుంచొని చాలా సీరియస్‌గా అడిగాడు.

'టిక్కెట్టడుగుతోంటే సరసా లంటావేమిటి ? టికెట్ లేదా ?'

ఆ అమ్మాయి కిలకిలా నవ్వేసింది. నవ్వేసి కొద్దిదూరంలో టేబుల్ ముందు కూచొని టి. సి. ఆర్ వ్రాసుకొంటున్న మరో టి. సి. ప్రసాద్‌నుద్దేశించి అంది:

'సూడు మావా ! నన్ను టికెట్టడుగుతున్నాడూ !... అయిదేళ్ళమట్టి, రోజూ రైల్లో పట్నం వచ్చి మా వూరు పోతున్నాను... ఇయ్యాల్టివరకూ టికెట్టె వొన్నోడు ఓరూ అడగనుకూడా లేదు...'

ప్రసాద్ తనూ ఇలా నవ్వేసి 'మనోడు ఈ గేటుకి కొత్తలేవే నాంచారమ్మా ! ఒరేయ్ ! అమోఘం ! వదిలెయ్యరా బాబూ ! దొరక్క దొరక్క ఈ కేసే దొరికిందా రసీదు చెయ్యడానికి...అదిగో అక్కడెవరో మామ్మగారు బండి దిగికూర్చుంది.



పామానెక్కువున్నట్లుగా వుంది. 'అన్‌బుక్డ్ లగేజ్' క్రింద ఛార్జిచేసి పారెయ్..'

ఈ మాటల్తో అమోఘరావుకి వాళ్ల వాన్నంత కోపం వచ్చింది

'ప్రసాద్ ! మైండ్ యువర్ బిజినెస్ !...ఇలా టికెట్లేనివాళ్ళని వదిలేస్తే, మనం దేనికో మరి జీతాలు దండుగ !... అదేం కుదర్దు నువ్వు డబ్బుకట్టాలమ్మాయ్...' ఫేర్స్ బుక్ తీసి చూస్తూ అన్నాడు.

ఈ మాటల్తో ఆ అమ్మాయి కూడ సీరియస్ అయిపోయింది.

'ఏంటయ్యోవ్ ! డబాయిస్తుండావే!.. ఇలాంటివి సాలా నూశా !...' అంటూ ముందుకి చొచ్చుకుపోయింది.

అమోఘరావు కేం చేయాలో అర్థం కాలేదు

'ఏ యమ్మాయ్ !...ఆగు !... ఆగకపోతే పోలీసుల కిస్తాను...'

అప్పటికే నాంచారమ్మ వరడుగులు వేసేసింది.

పరిగెత్తుకెళ్లి ఆమె చెయ్యి పట్టుకు ఆపబోయాడు అమోఘరావు.

నాంచారమ్మ ఛటాలున చెయ్యి వెనక్కు లాక్కోడం, పిండి మర బెల్టులా చేతిని అమోఘరావు చెంపమీద తిప్పడం, నీటి చుక్కలు పడిన లాంతరు చిమ్నీలా అతని చెంప 'ఫాప్' మని పేలడం యివన్నీ తెలుగు సినిమా చివరి సీనులా చక చక జరిగిపోయినయి. కాపోతే కొద్దిగా వేచురల్‌గా వుంది. ఆ తరువాత సీను కూడా చాలా సహజంగా వుంది. అప్పటి కప్పుడే నలుగురు పాసెంజర్లు పోగడ్డారు.

నాంచారమ్మ గొంతు హార్మోనియంలో ఆఖరి రీడ్ నొక్కేసినట్లు అరుస్తోంది.


'వచ్చినోడా!... టికెట్టిచ్చుకొంటూ చెయ్యట్టుకొంటావా?...నా అబ్బండిప్పు డిక్కడుంటే నీ ప్రాణం తీస్తును. ఏటను కొన్నావేటోనూ! నా అక్బెండెవరను కొన్నావురా?... వాలువిగాద నూరిగాడు ... నీలాటోళ్లారుసురిని, తోటకూరకాడల్లా ఇరిచేడిప్పటికి జాగ్రత్త... వొల్లు దగ్గ రెట్టుకు బ్రతుకు..'

వచ్చినోల్లుగూరా కూడా డైలాగు విసిరేరు.


'అమ్మమ్మమ్మా!... ఇతగాడ్నిలా వదిలేస్తే లాభం లేదండీ... ఇవాళ ఆ పిల్లయింది.


నొప్పిని త్వరగా తొలగించడానికి మాత్రమే 'ఆస్ప్రో' మైక్రోఫైన్డ్ కాబడినది

క్రొత్త మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' ఈ విధంగా పనిచేస్తుంది.




బిళ్ళలోని అణువు ఎంత పెద్దదిగా వుంటే అంత నెమ్మదిగాను అది ఇముడుతుంది– అందువల్ల మీరు, నొప్పి తగ్గడానికి చాలాసేపు ఆగాలి.




ఇది మైక్రోఫైన్డ్ చెయ్యబడుట వలన, ప్రతి క్రొత్త మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' బిళ్ళలోను ఇంచు మించు 15 కోట్ల అతి సూక్ష్మమైన అణువులు వుంటాయి ఇందువలన, అది అతి త్వరగా ఇమిడి. అతి శీఘ్రంగా నివారణ ఇచ్చును.

వీటి కోసం క్రొత్త మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో'ను వాడండి : నొప్పి • తల నొప్పి • ఒళ్ళు నొప్పి • ఫ్లూ • జ్వరముతో కూడిన జలుబు • కీళ్ళ నొప్పి • గొంతుక నొప్పి • పంటి పోటు.

క్రొత్త మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' నొప్పిని నివారించుటకు, ఇప్పుడు మీకు లభించే వాటిలో అతి ఆధునికమైన సాధనము.




మైక్రోఫైన్డ 'ఆస్ప్రో'
అతి శీఘ్రంగా నొప్పిని తొలగించును

A.G 22-48 TL

నికోలస్ తయారు

# టి. సి. అమోఘం

లేవు మర్లోళ్ళవుతారు...అంచేత వాడిమీద రిపోర్టు వ్రాసేసి అందరం సంతకాలెట్టేసి పైకి గుద్దేస్తే సరి ... తిక్క కుదుర్తుంది...' కాసేపయాక అందరూ వెళ్ళిపోయారు. నాంచారమ్మా వెళ్ళిపోయింది. అమోఘం చెంపమీద నాంచారమ్మ అయిదువేళ్ళు కూడా పైకి తేలిపోయినయి ప్రసాద్ కిసుక్కున నవ్వాడు.

'ఒరేయ్ అమోఘం! వద్దురా అంటే విన్నావ్ ...అదసలేనిసింద్రీరాబాబూ! రౌడీ నూరిగాడుంచుకొన్నాడు దాన్ని... అదెళ్ళి సంగతి వాడితో చెప్పిందంటే, డ్యూటీ దిగ్గానే నిన్ను స్టేషన్ బయటపట్టుకొని 'టివోపాల్' పెట్టి ఉతికేస్తాడంతే...' అంచేత వెధవ 'స్ట్రిక్టుతనం' పోకు...' అమోఘరావుకి అదివరకే వళ్ళుమండి వుంది. ప్రసాద్ మాటల్తో పిచ్చెక్కిపోయింది.

'పోర్మయ్! నా యిష్టం!... నా డ్యూటీ నేను చచ్చినట్లు చేస్తేరతాను అనక చచ్చినాసరే...ఆ!..' అనేసి చరచర ప్లాట్‌ఫారం మీదకి వెళ్ళిపోయి మిగిలిపోయిన పాసింజెర్ల దగ్గర చెకింగ్ మొదలెట్టేశాడు.

ఆ కోపంలో మూడేళ్ళ వారం రోజుల పసుమగల టికెట్టులేని ఓ కుర్రాణ్ణి, పాసింజెర్ కారేజిలో కోడిని పట్టుకొచ్చిన ఓ సాయిబుగారి హాఫ్ టికెట్ కొనుక్కొన్న ఓ పద్దెనిమిదేళ్ళ పాపాయిని లగేజ్ చెయ్యకుండా మనవడికిష్టమని ఓ బామ్మగారు తెచ్చుకొచ్చిన నాలు గోంగూర జాడీలనీ, పట్టుకొని డబుల్ ఛార్జి చేసిపారేశాడు. మరో వైపునుంచి స్టార్టవబోతున్న ఓ పాసింజెర్ ట్రెయిన్‌లోని సెకండ్‌క్లాసులో ఎక్కి తలుపు దగ్గర నుంచున్న ఓ కాలేజీ కుర్రాణ్ణి టికెట్టడిగాడు.

ఆ కుర్రాడదేం వినబడనట్లు మరోవైపు చూడసాగాడు

'మిష్టర్! నిన్నే...టికెట్?...'

'టిక్కెట్టు మాతమ్ముడు దగ్గరుంది!'

'మీ తమ్ముడేడీ?'

'అది తెలిస్తే, టికెట్ నా దగ్గరే వుండేదిగా...వాడే పెట్లో ఎక్కాడో ఏమో!'

'టికెట్ మీ దగ్గరలేందే బండి ఎక్కడానికి వీల్లేదు...అయినా అదసలు సెకండ్ క్లాసుదేనా?'

కుర్రాడు ఓ క్షణమాగి పర్సులోంచి ఓ టికెట్టు తీసి అతని కిచ్చాడు.

అది సెకండ్‌క్లాస్ టికెట్. టికెట్ మీద సైన్ చెయ్యబోతుంటే అమోఘరావు దృష్టి దాని తారీఖుమీద పడింది. అది వారంరోజుల క్రితం తారీఖుది.

'ఏయ్ మిష్టర్!...ఈ టికెట్టివాళ్టిది కాదుగా...'

'ఇవాళ్టిదని ఎవడన్నాడయా?...నేనెప్పుడూ సెకండ్ క్లాస్‌లోనే ట్రావెల్ చేస్తానని మీకు తెలియడానికి చూపించాను...'

ఇంజను కూత వేసింది. వెంటనే గార్డు విజిల్ కూడా వినబడింది.

'నువ్విక్కడ దిగాలి! టికెట్ లేందే పోడానికి వీల్లేదు...'

స్టూడెంట్ దిగకుండానే ఎవర్నో చూచి పిలచాడు.

'ఒరేయ్! తమ్ముడూ! ఈయనకి నా టికెట్ చూపించరా...'

అతనుదగ్గరకువచ్చి టికెట్‌చూపించాడు.

'మరి...మీ టికెట్టేదీ?' తమ్ముణ్ణి అడిగాడు అమోఘం.

బండి కదిలింది. స్టూడెంట్సిద్దరూ బండిలోకి దూకేశేరు.

'నాది నా దగ్గరెందుకుంటుంది టి. సి గారూ! మా తమ్ముడు దగ్గరుంటుంది. కావాలంటే మా యింటికి రావోయ్- ఎప్పి కావాలంటే అన్ని టికెట్లు చూపిస్తాను...అరె! ... వెళ్ళిపోతావేమోయ్ ... దమ్ముంటే రారాదూ...'

బండి వేగం అందుకొంది.

అమోఘరావు ఏమీచేయలేక చూస్తూండిపోయాడు.

మరో పదినిమిషాలకే మద్రాసు ఎక్స్‌ప్రెస్ ఆగింది ప్లాట్‌ఫారంమీద.

బండి ఆగుతూనే రంగడు బాబాయి దిగేడు పెట్టె బెడ్డింగు తీసుకొని.

'ఏరా! చిట్టి! అయిదేళ్ళయిపోయింది నిన్ను చూసి.. మొన్న సింగినాథం కనబడి చెప్పేడు. నువ్వు రేల్వేలో పెద్దచెకింగ్ ఉద్యోగంలో వున్నావావటాని ... ఇక్కడికి టికెట్టు కొనబోతూంటే వాడే కోప్పడ్డాడు.

'అక్కడ చిట్టోడుండగా టికెట్టేంటి? కనీసం నువ్వు కొనబోయినట్లు వింటేనే వారంరోజులు మనను కష్టపెట్టుకుంటాడువాడు. అలాంటి పిచ్చిపని జెయ్యకు అని' అన్నాడు అమోఘరావు దగ్గరకొచ్చి.

ఇదంతా చెప్పేలోపల అమోఘరావు రసీదు వ్రాయడం పూర్తి చేసేడు.

'ఆర్రూపాయల ముప్పావలాకట్టి రసీదు తీసుకోండి! లేకపోతే పోలీసుల కివ్వాల్సి వస్తుంది...'

రంగడు బాబాయి తెల్లబోయి, సంగద్దెల్సుకొని బూతులు తిట్టేయడం మొదలెట్టేడు.

'మీ వంశమే అంతరా! అందరూ దౌర్భాగ్యపు వెధవలు...ఇకనుంచి మా ఇంటి మీద పిచ్చిక కూడా మీ యింటిమీద వ్రాలదు...ఛీ!' అనేసి కండువా దులిపేసి డబ్బుకట్టి, రసీదు తీసుకొని బయటకు నడిచాడు.

ఆ కోపంతో, అమోఘరావు మళ్ళీ ప్లాట్‌ఫారంమీదకి నడిచి అప్పుడే ఫస్టు క్లాసులోంచి దిగుతూన్న తన సుపీరియర్‌ని 'పాస్' చూపించమన్నాడు. కమర్షియల్ ఇనిస్పెక్టర్ నవ్వుతూ 'ఏమిటోయ్ అమోఘం! నాది సెకండ్ క్లాస్ పాసని నీకు తెలుసుకదా?...ఇంక చూసే దేముంది?' అన్నాడు.

'అట్లయితే ఫస్ట్‌క్లాసులో ట్రావెల్ చేసినందుకు ఎక్సెస్ చేస్తున్నాను ... ముప్ఫయిఆర్రూపాయలు కట్టండి!...'

'నిజంగానే అంటున్నావా... నే నెవరో గుర్తుంది కదూ నీకు...?'

'మీరు డబ్బు కడతారా కట్టరా?' ఎదురు ప్రశ్న వేశాడు అమోఘం.

ఆయన 'ఆల్ రైట్' అంటూ డబ్బు కట్టేశాడు.

వారంరోజుల తర్వాత 'మిస్ బిహేవియర్ విత్ పాసింజెర్స్' అన్న కారణంమీద అమోఘరావుని డిస్మిస్ చేశారు. అతను అరుగుమీద కూచునుంటే, కాలేజీకి పోతున్న అతని మరదలు పాపాయి అతని వంక చూసి కిసుక్కున నవ్వింది '...తప్పించుకొన్నావ్ బావా!...' అంటూ తన వేలు చూపించి. ●

